# రోడ్డు భద్రత ఏదీ..?


ఇలాగైతే ప్రమాదాలు జరగవా..?: కోడుమూరు వద్ద ఆటోపైన కూర్చొని వెళ్తున్న ప్రయాణికులు

- రక్తమోడుతున్న రహదారులు
- సిద్ధాపురం, ఎర్రకోట ఘటనల్లో ఏడుగురు మృతి
- ఏప్రిల్ నెలలోనే 15మంది దుర్మరణం
- ప్రకటనలకే పరిమితమైన ప్రమాదాల నివారణ చర్యలు
- వీధిన పడుతున్న కుటుంబాలు

రోడ్డుపైకి వచ్చిన మనిషి సురక్షితంగా ఇంటికి చేరతాడన్న భరోసా నానాటికీ తగ్గిపోతోంది. ఏ మూల మలుపులో ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందో.. ఎక్కడ ఏ గుంత నోరుతెరిచి నిలువునా మింగేస్తుందో తెలియని పరిస్థితి. రెప్పపాటులో సంభవిస్తున్న రోడ్డుప్రమాదాలు ఎన్నో కుటుంబాలను అనాథలుగా మార్చేస్తున్నాయి. పోలీసులు, రవాణా శాఖ అధికారులు హడావుడి చేయడం.. ఆ తరువాత షరా మాములే. రెండు రోజుల వ్యవధిలో ఆత్మకూరు, ఎర్రగోట వద్ద జరిగిన రోడ్డు ప్ర మాదాల్లో ఏడుగురు అనంతలోకాలకు చేరారు. ఏప్రిల్ నెలలోనే సుమారు 15మందిని ప్రమాదం రూపంలో రహదారులు కబళించాయి. ప్రమాదాలను అరికట్టడానికి ప్రయత్నిస్తున్నా.. వైఫల్యం చెందుతున్నారు.

ఈ వైఫల్యానికి కారకులు ఎవరు..? నిత్యం రక్తమోడుతున్న రోడ్ల మూలంగా వీధిన పడుతున్న అభాగ్యులకు అండగా నిలిచేదెవరు? భరించలేని వైద్య ఖర్చులు, ఉపాధి కోల్పోవడంతో క్షతగాత్రులు ఆర్థికంగా చితికిపోతున్నారు. వారిలో అత్యధికులు పేదలు, మధ్యతరగతి ప్రజలే. వారి బాగోగులు చూసేదెవరు..?

ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.


ఆత్మకూరు మండలం సిద్ధాపురం చెరువుకట్ట వద్ద ప్రమాదానికి కారణమైన వాహనం (ఫైల్)

**కర్నూలు, మే 4 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సిద్ధాపురం చెరువుకట్ట వద్ద కర్నూలు-గుంటూరు వయా ఆత్మకూరు, దోర్నాల జాతీయ రహదారిపై బొలెరో గూడ్స్ వాహనం అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈఘటనలో ఆదోని, ఎర్రబాడుకు చెందిన ఐదుగురు మృత్యువాత పడ్డారు. ప్రమాదానికి డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం అని ప్రాథమికంగా తేల్చేశారు. అయితే.. రాయలసీమ నుంచి రాజధాని అమరావతికి వెళ్లే కీలకమైన జాతీయ రహదారి సింగిల్ రోడ్డు ఇది. ఎదురుగా వస్తున్న ఓ వాహనానికి సైడ్ ఇవ్వబోతూ రోడ్డు దిగడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తుంది.

- ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట సమీపంలో మలుపు వద్ద సరుకులు రవాణా చేసే అశోక్ లైలాండ్ వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో కడిమెట్ల గ్రామం, అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రంకు చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదానికి అతివేగమే కారణమని అంటున్నారు. మలుపు వద్ద స్పీడ్‌బ్రేకర్లు (వేగ నిరోధకాలు) ఏర్పాటు చేయలేదు.. నిర్మాణ లోపాలు కూడా ప్రమాదాలకు కారణమని అంటున్నారు. అతివేగం వల్లనో.. డ్రైవర్ల నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లనో ప్రమాదాలు జరుగుతున్నాయనడంలో సందేహం లేదు. అయితే.. జాతీయ రహదారుల ప్రమాణాలకు అనుగుణంగా రోడ్లు లేకపోవడం, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటులో అంతులేని అలసత్వం, పాదాచారులు రోడ్లు దాటేందుకు సరైన వసతులు లేకపోవడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతసేపు రవాణా శాఖ, పోలీసుల దృష్టంతా జనానికి జరిమానాలు వేయడంపైనే ఉండడంతో 'రహదారి భద్రత నిబంధనల స్ఫూర్తి' ప్రశ్నార్థకంగా మారుతుంది.


ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట సమీపంలో ప్రమాద స్థలంలో మృతదేహాలు(ఫైల్)

మిగతా 7వ పేజీలో

### జనవరి నుంచి ఏప్రిల్ వరకు 58 ప్రమాదాలు

జిల్లాలో ఏడాదిలో సగటున 135-145 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, 40-50 మందికిపైగా మృత్యువాత పడితే.. 150మందికి పైగా గాయాలతో బయటపడుతున్నారు. ఈఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 58 ప్రమాదాలు జరిగాయి. 24 మంది మృతిచెందగా, 110మందికి పైగా గాయపడ్డారని పోలీస్ రికార్డులు ద్వారా తెలుస్తుంది. ఒక్క ఏప్రిల్ నెలలో 10కిపైగా ప్రమాదాలు జరిగాయి. 15 మంది వరకు మృత్యువాత పడ్డారు. రెండు రోజుల్లోనే జరిగిన ఆత్మకూరు, ఎర్రకోట ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ప్రమాద మృతులంతా పేదలు, మధ్యతరగతి సామాన్య ప్రజలే.

### ఆటోలపై నియంత్రణ ఏదీ?

రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే మెజార్టీగా మోటార్‌బైక్, ఆటో ప్రమాదాలే అధికంగా ఉంటున్నాయి. నిబంధనల మేరకు త్రీవీలర్ ఆటోలో డ్రైవర్‌తో పాటు నలుగురు, టాటా ఏసీ (సెవన్ సీటర్) ఆటోలో డ్రైవర్‌తో పాటు ఏడుగురు ప్రయాణికులను మాత్రమే ఎక్కించుకోవాలి. 10నుంచి 25మందికిపైగా ప్రమాణికులను ఎక్కించుకుంటున్నా రవాణా, పోలీస్ శాఖల అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. గూడ్స్ రవాణాచేసే ట్రాలీ ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోరాదని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ఇందుకు విరుద్ధంగా ట్రాలీకి మధ్యలో చెక్కపలక ఏర్పాటుచేసి దాదాపు 25మందికిపైగా ఎక్కించుకుంటున్నారు. ప్రధా నంగా జాతర్లు, వివాహాలు, గ్రామోత్సవాలకు ఇలా తరలిపోతున్నారు. ఎక్కడైనా పోలీసులు, రవాణా అధికారులు ఆపేస్తే, మా వాళ్లే వదిలేయండి.. అని ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్లు వస్తుండడంతో చూసీచూడనట్లు వెళ్తున్నామని ఓఅధికారి పేర్కొనడం కొసమెరుపు.


ఆటోలో కిక్కిరిసి కూర్చున్న ప్రయాణీకులు: డ్రైవర్ ఆటో నడిపేదెలా..?

## భక్తులతో కిక్కిరిసిన శ్రీమఠం


భక్తులతో సందడిగా మారిన శ్రీమఠం ప్రాంగణం

**మంత్రాలయం, మే 4(ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. బుధ, గురు, శుక్ర, శనివారం వరకు వేలాది మంది భక్తులు రావడంతో మఠం అతిథి గృహాలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్‌న్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శ్రీమఠం అధికారులు ఏఏవో మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ప్రధాన రహదారిపై ఇరువైపులా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్యతో భక్తులు, గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు.

## సెలవులో ఎస్పీ విక్రాంత్ పాటిల్

### నంద్యాల ఎస్పీకి ఇన్‌చార్జి బాధ్యతలు

**కర్నూలు క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఇద్దరు సెలవులపై వెళ్లారు. ఈ నెల 15వ తేదీ వరకు వీరిద్దరు సొంత పనిమీద జపాన్ టూర్‌కు బయలుదేరి వెళ్లారు. కర్నూలు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాకు బాధ్యతలు అప్పగించారు.

# రూ.600 కోట్లు మట్టిపాలు


మోటార్లను పెట్టేందుకు రింగులు ఏర్పాటుచేసి వదిలేసిన దృశ్యం

- ఏడాదిగా నిలిచిపోయిన 'రాయలసీమ ఎత్తిపోతల' పనులు
- తుప్పుపడుతున్న పరికరాలు
- ఇక్కడి సామగ్రి హంద్రీ నీవాకు తరలింపు
- పనులకు ఇక మంగళమేనా?

**జూపాడుబంగ్లా, మే 4 (ఆంధ్రజ్యోతి):** రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం ఇప్పటి వరకు ఖర్చు పెట్టిన రూ.600 కోట్లు మట్టిపాలు కానున్నాయి. ప్రాజెక్టు పనులు నిలిచి పోయాయి. ఇక ముందుకెళ్లే పరిస్థితి కనిపించడంలేదు. వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు కోసం ఖర్చుపెట్టిన డబ్బులు మట్టిపాలేనంటూ చర్చించుకుంటున్నారు. గత వైసీపీ హయాంలో కృష్ణానది నుంచి రాయలసీమ జిల్లాలకు తాగు, సాగునీరు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు శ్రీశైలం జలాశయంలో 800 అడుగుల మేర ఉన్న సమయంలో కూడా నీటిని ఎత్తి పోసుకునేందుకు చేపట్టినదే రాయలసీమ ఎత్తిపోతల పథకం. అప్పట్లో ప్రభుత్వం ఎలాంటి పర్యావరణ అనుమతులు తీసుకోకుండానే హడావుడిగా ప్రారంభించింది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నోసార్లు ఆరోపించి చివరికి కోర్టుకు వెళ్లడంతో ఏడాది నుంచి పనులు ఆగిపోయినట్లు తెలుస్తోంది. అప్పట్లో తమను ఎవరు అడ్డుకో లేరనే ధీమాతో ముందుకెళ్లి పనులు చేపట్టారు. రూ.3,200 కోట్ల అంచనాలతో దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ 2022 సంవత్సరం నుంచి ముమ్మరంగా పనులు చేపట్టింది. పరికరాలు, మోటార్లు కూడా సరఫరా చేసింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సమీపంలో పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టింది. 12 మోటార్లు అమర్చాలని సిద్ధంచేసింది. పంప్‌హౌస్ నుంచి కృష్ణానదిలోకి ఎనిమిది కిలోమీటర్ల పొడవున అప్రోచ్‌కాల్వను కూడా దాదాపుగా తవ్వింది. దాదాపుగా ప్రాజెక్టుకు ఇప్పటివరకు మొత్తం రూ.600 కోట్లవరకు ఖర్చుపెట్టినట్లు తెలిసింది. రోజూ మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోయాలనే ఈ పథకం లక్ష్యం పూర్తి కాకుండానే ఆగిపోతుందనే అపోహలు లేకపోలేదు. ఇక్కడ దక్కించు కున్న సంస్థ హంద్రీనీవా పనులు దక్కించు కోవడంతో ఇక్కడ ఉన్న మెటీరియల్, కంకరను 10రోజుల నుంచి రాత్రిపూట అక్కడి తరలిస్తుండటంతో పనులు జరగక పోవచ్చన్న దానికి బలం చేకూరుతోందని తెలుస్తోంది.

### అధికారుల పర్యవేక్షణ కరువు

రూ. కోట్లు ఖర్చు చేసి పథకం నిర్మాణం కోసం తీసుకొచ్చిన పరికరాలకు రక్షణ కరువైంది. పరికరాలు తుప్పుపడుతున్నాయి. పనులు నిలిచిపోవడంతో అధికారుల పర్యవే క్షణ కూడాలేదని తెలుస్తోంది. అప్రోచ్‌కాల్వ పనులు కూడా శ్రీశైలం జలాశయానికి నీటి మట్టం పూర్తిగా వచ్చినప్పుడు అప్రోచ్ కాల్వకు ఇరువైపులా ఉన్న మట్టికోతకు గురై పూడిక తో నిండిపోతుంది.

### కనుమరుగేనా?

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కృష్ణానది-గోదావరి నదుల అనుసంధానంతో పోలవరం-బానకచర్ల ప్రాజెక్టు నిర్మించనుంది. దీంతో రాయలసీమకు తాగు, నీరు అందితే పంటలు పండి ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతాయని ప్రచారం సాగుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే 'రాయలసీమ ఎత్తిపోతల' కనుమరుగు కానుందా అంటూ చర్చించుకుంటున్నారు.

### కోర్టు ఆదేశాలతో నిలిచిన పనులు

ప్రాజెక్టు నిర్మాణం కోసం పర్యావరణ అనుమతులు తీసుకోకుండా పనులు చేయకూడదని తెలంగాణ ప్రభుత్వం కోర్టులో పిటిషన్ వేయగా కోర్టు ఆదేశాలతో పనులు నిలిచిపోయాయి. మోటార్లు , పరికరాలు తుప్పుపట్టకుండా జాగ్రత్తగా ఉంచాం.

- వెంకటేశ్వరరెడ్డి, డీఈ, రాయలసీమ ఎత్తిపోతల పథకం

# సన్‌డే భగభగలు

- ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు
- పాణ్యం మండలంలో 42.66, వెల్దుర్తి మండలంలో 42.45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

**నంద్యాల ఎడ్యుకేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆదివారం ఎండలు భగ్గుమన్నాయి. రాష్ట్రంలోనే అనేక చోట్ల వర్షాలు కురిసినప్పటికీ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మాత్రం భానుడు భగ్గుమన్నాడు. ఉమ్మడి జిల్లాల్లో అత్యధికంగా పాణ్యం మండలం గోనవరంలో 42.66 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నంద్యాలలో 42.07, బనగానపల్లెలో 42.0, జూపాడుబంగ్లా 41.97, దొర్నిపాడు 41.84, గోస్పాడు 41.6, సంజామల 41.59, కోవెలకుంట్ల 41.42, నందికొట్కూరు 41.22, గడివేముల 41.2, ఆళ్లగడ్డ 41.12, బండిఆత్మకూరు 41.06, బేతంచర్ల 41.03, రుద్రవరం 40.97, జీన్ 40.9, శిరువెళ్ల 40.87, కొలిమిగుండ్ల 40.5, నందవరం 40.4, ఓర్వకల్ 40.29, క్రిష్ణగిరి 40.2, దేవనకొండ 39.89, గోనెగండ్ల 39.79, యమ్మిగనూరు 39.7, ఆస్పరి 39.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.


నిర్మానుష్యంగా నంద్యాలలోని సంజీవ నగర్ ప్రధాన రహదారి

**కర్నూలు జిల్లాలో**

కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కలుగొట్లలో 42.45డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కోడూమూరు 42.4, కర్నూలునగరం 41.42, సి.బెళగల్ 41.09, మంత్రాలయం 40.79, కల్లూరు 40.77, కోసిగి 40.5, కొత్తపల్లె 40.4, చాగలమర్రి 40.15, అవుకు 39.85, పాములపాడు 39.79 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.

## భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకం: కలెక్టర్


నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సగర ఉప్పర సంఘం నాయకులు

**కర్నూలు కలెక్టరేట్, మే 4 (ఆంధ్రజ్యోతి):** భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకమని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో భగీరథ చిత్రపటానికి కలెక్టర్, సగర ఉప్పర సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ కఠోర శ్రమ చేసి దేనినైనా సాధించగలమని భగీరథ మహర్షి నిరూపించారని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని యువత లక్ష్యాలను సాధించాలని సూచించారు. వెనుకబడిన తరగతుల వారి జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు చేపడుతున్న కార్యాచరణను పూర్తిస్థాయి ఫలాలు వారికి అందేలా నిరంతరం కృషి చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని బీసీలందరూ వినియోగించుకోవాలని సూచించారు. గతంలో తాత్కాలికంగా మూతపడిన హాస్టళ్లను కూడా తిరిగి ప్రారంభించబోతున్నామన్నారు. విద్యార్థులు భగీరథ మహర్షిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. సమావేశంలో బీసీ వెల్ఫేర్ అధికారి కె.ప్రసూన, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివ, డైరెక్టర్ విజయకుమార్, సగర సంఘం అధ్యక్షులు సత్యన్న, సొసైటీ కన్వీనర్ దూదేకొండ కుమార్, జిల్లా గౌరవ ప్రెసిడెంటు డా.గిడ్డయ్య, సగర ఉప్పర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## క్యాంపుల్లో కౌన్సిలర్లు..!

- అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో వేడెక్కిన రాజకీయం
- మున్సిపల్ కౌన్సిలర్ల పాలిట వరం
- లక్షల రూపాయలు డిమాండ్?
- హైదరాబాద్‌లో ఓ వర్గం.. బెంగళూరులో మరో వర్గం?

7

# ప్రశాంతంగా ముగిసిన నీట్

- విద్యార్థుల హాజరు 98.10 శాతం
- కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు కలెక్టరేట్/ ఎడ్యుకేషన్ , మే 4 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో నీట్ యూజీ పరీక్ష ప్రశాంతంగా జరిగాయని, 98.10 శాతం విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరయ్యారని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. ఆదివారం నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల, క్లస్టర్ యూనివర్సిటీలలో నీట్ పరీక్షలు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. పరీక్ష నిర్వహణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కర్నూలు నగరంలోని 16 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 4466 మంది విద్యార్థులకు గానూ.. 4381 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 85 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షను కలెక్టర్ ఆధ్వర్యంలో ఆర్‌డీవో వెంకటనారాయణమ్మ, వివిధ శాఖల అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పర్యవేక్షించారు.


హాల్ టికెట్ నెంబరు చూసుకుంటున్న విద్యార్థులు


పరీక్షాకేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు


కర్నూలులో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

## బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

**నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం**



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న సదాశివం

**ఆదోనిటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి):** శ్రీశైలానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకుంటామని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. ఆదివారం ఇందిరానగర్‌లో బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి మనోధైర్యం ఇచ్చారు. మృతులకు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉండి ఉంటే ఒక్కొక్కరికి రూ.5లక్షలు పార్టీ నుంచి అందించడానికి అవకాశం ఉండేదన్నారు. లేనికారణంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్‌తో మాట్లాడి వారి కుటుంబాలకు ఆర్థికంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. తీవ్రగాయాలతో కర్నూలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నవారికి మెరుగైన సేవలను అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసి కోరామన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్, టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, కృష్ణారెడ్డి, నాయీ బ్రహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు చిన్నరంగ స్వామి, అధ్యక్షుడు ఈరన్న, నాగరాజు పాల్గొన్నారు.

# క్యాంపుల్లో కౌన్సిలర్లు..!

- అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో వేడెక్కిన రాజకీయం
- మున్సిపల్ కౌన్సిలర్ల పాలిట వరం
- లక్షల రూపాయలు డిమాండ్?
- హైదరాబాద్‌లో ఓ వర్గం.. బెంగళూరులో మరో వర్గం?
- హవా నడిపిస్తున్న మహిళా కౌన్సిలర్ల భర్తలు




నందికొట్కూరు మున్సిపల్ కార్యాలయం

**నందికొట్కూరు, మే 4 (ఆంధ్రజ్యోతి):** నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం క్యాంపు రాజకీయాలకు తెర లేపింది. మున్సిపాలిటీలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం కౌన్సిలర్ల పాలిట వరంగా మారిందన్న చర్చ జరుగుతోంది. నందికొట్కూరు మున్సిపాల్టీలో 29మంది కౌన్సిలర్లు ఉన్నారు. అందులో చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి వర్గంలో ఆయనతో కలిపి 11మంది కౌన్సిలర్లు ఉన్నారు. జాకీర్‌హుస్సేన్ వర్గంలో 16మంది కౌన్సిలర్లు, వైసీపీలో ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. ఎవరి వర్గాన్ని వారు కాపాడుకునేందుకు క్యాంపు రాజకీయాలకు తెరతీశారు. చైర్మన్ వర్గంలో ఏడుగురు బెంగళూరుకు వెళ్లగా మరో నలుగురు నందికొట్కూరులోనే ఉన్నట్లు తెలుస్తోంది. జాకీర్‌హుస్సేన్ వర్గంలో ముగ్గురు, నలుగురు మినహా అందరూ హైదరాబాద్‌కు వెళ్లినట్లు సమాచారం. వైసీపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లలో ఒకరు హైదరాబాదులో ఉండగా, మరొకరు నందికొట్కూరులోనే ఉన్నట్లు తెలుస్తోంది. స్థానికంగా ఉన్న కౌన్సిలర్లు నిరంతర అధినాయకుల పర్యవేక్షణలో ఉన్నట్లు తెలుస్తోంది.

### ఫోన్లలోనే బేరసారాలు

క్యాంపులో ఉన్న కౌన్సిలర్లను కూడ తమవైపు మళ్లించుకునేందుకు రెండువర్గాల నాయకులు ఫోన్లలోనే బేరసారాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. తమకు మద్దతు తెలిపితే ఎదుటి వ్యక్తికంటే ఒక లక్ష రూపాయలు ఎక్కువ ఇస్తామంటూ ఓవర్గం నాయకుడికి మద్దతుదారులు కౌన్సిలర్లకు ఫోన్‌లు చేస్తున్నట్లు సమాచారం. అందులో ఒక కౌన్సిలర్ రూ.10లక్షలు ఇస్తే తన మద్దతు తెలుపుతానని మధ్యవర్తులతో చెప్పినట్లు సమాచారం. ఆ మధ్యవర్తులు వైసీపీ నాయకులు కావడం గమనార్హం. దీంతో రెండువర్గాల్లోని కౌన్సిలర్లు భారీగా డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. డబ్బుల కోసమే కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసాన్ని తెరపైకి తెచ్చారన్న చర్చ పట్టణంలో జరుగుతోంది.

### విలాసాల్లో మహిళా కౌన్సిలర్ల భర్తలు?

నందికొట్కూరు మున్సిపాల్టీలోని 29 కౌన్సిలర్లలో 14 మంది మహిళా కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో ఒకరిద్దరు కౌన్సిలర్ల భర్తలు మినహా మిగిలిన మహిళా కౌన్సిలర్ల భర్తలు భార్యల తరుపున నాయకులు ఏర్పాటు చేసిన క్యాంపులకు వెళ్లారు. మే8న సభకు హాజరు కావాల్సింది మహిళా కౌన్సిలర్లు అయితే వారిస్థానంలో భర్తలు క్యాంపు రాజకీయాల్లో పాల్గొని జల్సా చేస్తున్నారని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.

## రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

**కర్నూలు క్రైం/ఆదోని/ఓర్వకల్లు, మే 4 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివీ.. కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయా లయ్యాయి. ఆదివారం రాత్రి సంతోష్‌నగర్ జాతీయ రహదారిపైన కర్నూలు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేసే రాఘవేంద్ర ప్రసాద్ ముందు వెళ్తున్న లారీని కారుతో ఓవర్‌టెక్ చేయబో యాడు. ఈ క్రమంలో లారీని ఢీకొనడంతో ఆయనకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అలాగే హైదరాబాదు జాతీయ రహదారిపైనే రావూరి గార్డెన్స్ వద్ద కారును లారీ ఢీకొన్న ఘటనలో కారు హంద్రీ బ్రిడ్జిలో పడిపోయింది. అందులో ఉన్న రిటైర్డు మున్సిపల్ ఉద్యోగి శ్రీనివాసనాయుడుకు స్వల్ప గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- ఆదోని సిరుగుప్ప ప్రధాన రహదారిలో గజ్జహల్లి క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు- బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయా లయ్యాయి. వివరాల మేరకు.. ఆర్టీసీ బస్సు సిరుగుప్ప నుంచి ఆదోనికి వస్తోంది. పెద్ద హరివాణం నుంచి కర్ణాటక రాష్ట్రం గుదేనూరు గ్రామానికి వెళుతున్న కురువ నాగప్ప అనే వ్యక్తిని బస్సు ఢీకొట్టింది. నాగప్ప తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.
- ఓర్వకల్లు మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై ఆదివారం సాయంత్రం తిప్పాయపల్లె బస్ స్టేజీ వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివీ.. హైదరాబాద్ నుంచి నంద్యాల జిల్లా బేతంచెర్లకు ఆల్విన్ లారీ కూల్‌డ్రింక్స్ బాటిళ్లతో వెళ్తుంది. తిప్పాయపల్లె నుంచి ఆటో అడ్డం రావడంతో వాటిని తప్పించబోయి యూటర్న్ వద్ద ఇనుస స్తంభాలను ఢీకొనడంతో ముందుటైర్లు విరిగి పడ్డాయి. క్షణాల్లోనే లారీ రోడ్డుకు అడ్డంగా విరిగి పడింది. డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం టోల్‌గేటు వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## యువకుడి దారుణ హత్య



రమేష్ (ఫైల్)

**రుద్రవం మే 4(ఆంధ్రజ్యోతి):** రుద్రవరంలో ఓ యువకుడి దారుణ హత్య కలకలం రేపింది. వివరాలివీ.. మండలంలోని పెద్దకంబలూరు గ్రామానికి చెందిన రమేష్ గతేడాది అదే గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమించి ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత తల్లిదండ్రులు ఇరువురి పిలిపించి మందలించి ఎవరి ఇంటికి వారిని తీసుకెళ్లారు. ఆ తర్వాత బాలిక మైనర్ వయసు దాటిపోయిన తర్వాత వేరే వ్యక్తితో వివాహం చేశారు. రమేష్ కూడా నంద్యాలకు చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. యువతి సోదరుడు అశోక్ రమేష్‌పై కక్ష పెంచుకున్నాడు. ఆరు నెలల క్రితం రమేష్ మిరప కూలీగా గుంటూరు వలస వెళ్లి నెల రోజుల క్రితం తమ స్వగ్రామానికి వచ్చాడు. యువతి సోదరుడు అశోక్‌కు, రమేష్‌కు బాగా పరిచయం కలిగిన ముగ్గురు స్నేహితులతో కలిసి రమేష్ హత్యకు పథకం రచించారు. మద్యం తాగడానికి రావాలని ఆదివారం రాత్రి అశోక్ తన స్నేహితుల ద్వారా రమేష్‌ను రుద్రవరం మండలం అప్పనపల్లె గ్రామ సమీపంలోని వెంగన్న మామిడి చెట్టు వద్దకు రప్పించాడు. అప్పటికే కాపు అశోక్, అతడి స్నేహితులతో కలిసి కత్తితో గొంతు కోసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, శిరివెళ్ల సీఐ దస్తగిరిబాబు తమ ఎస్‌ఐలు వరప్రసాద్, చిన్న పీరయ్యతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. గతంలో రమేష్, అశోక్‌ల మధ్య పలుమార్లు గొడవ కూడా జగిందని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. రమేష్ భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అవోపా సేవా కార్యక్రమాలు అభినందనీయం

**● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్**




టీజీ వెంకటేశ్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న అవోపా కార్యవర్గ సభ్యులు

**కర్నూలు కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి):** ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) సేవా కార్యక్రమాలు అభినందనీయమని, రాష్ట్రంలోనే కర్నూలు అవోపా సేవారంగంలో ముందుందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని సుంకేసుల రోడ్డులోగల అవోపా సేవా సదన్‌లో అవోపా కర్నూలు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవోపా నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తోందని అన్నారు. అవోపా చేపట్టే సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని సూచించారు. నూతన అధ్యక్షుడిగా డాక్టర్ పి. లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా జీవీ మురళీకృష్ణ, కోశాధికారిగా పి. వెంకటేశ్వర్లు, తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా టీజీ శివరాజ్, అవోపా చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు, రత్నప్రసాద్, యుగంధర్ శెట్టి, మహిళా విభాగం అధ్యక్షురాలు అనిత, సభ్యులు సరిత, శోభారాణి, లక్ష్మీ సుజాత, శ్రీదేవి తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో అవోపా సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పద్య కవిత్వానికి ఆదరణ అవసరం

- టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య
- 'దేవుడా' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పత్తి ఓబులయ్య, సాహితీవేత్తలు

**కర్నూలు కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి):** ఆధునిక కాలంలో పద్య కవిత్వానికి ఆదరణ అవసరమని, పద్యం హృద్యంగా సాగిపోయే సజీవ నదిలాంటిదని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కర్నూలు తెలుగు సారస్వత వైభవం సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఆచార్య గుబ్బా బాలస్వామి రచించిన 'దేవుడా!' (శతకం) పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. సభలో పుస్తకాన్ని ఆవిష్కరించిన కళారత్న పురస్కార గ్రహీత విద్వాన్ పత్తి ఓబులయ్య మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో పద్యానికి సుస్థిర స్థానం ఉందన్నారు. ఆదికవి నన్నయ్య మొదలు ఆధునిక కవుల వరకు పద్య కవిత్వం రాసి ప్రశంసలు అందుకుంటున్న వారు ఎందరో ఉన్నారని, ఆ దిశగా పుస్తక రచయిత గుబ్బా బాలస్వామి మంచి పుస్తకాన్ని తీసుకువచ్చారని తెలిపారు. యోగి వేమన లాంటి మహనీయుల పద్యాలు నేటికీ ప్రజల నోళ్లలో నానుతుండటం పద్యానికి ఉన్న విశిష్టతను చాటి చెబుతోందని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ రచనలకు సామాజిక ప్రయోజనం ముఖ్యమని, భవిషత్ తరాలకు సందేశాన్ని ఇచ్చేలా రచనలు అవసరమని చెప్పారు. కవయిత్రి కర్నాటి చంద్రమౌళిని పుస్తక సమీక్ష చేసిన ఈ సభలో పుస్తక రచయిత ఆచార్య గుబ్బా బాలస్వామి మాట్లాడుతూ తన 70ఏళ్ల వయసులో చందస్సు నేర్చుకొని పద్యాలు రాస్తున్నానని, ఇది తన మూడో పుస్తకమని చెప్పారు. సభలో జంధ్యాల రఘుబాబు, డాక్టర్ రాధాశ్రీ, ఆరేపల్లి వరలక్ష్మమ్మ, ముద్రిక భాస్కర్ పాల్గొన్నారు.

# ఒక్కటైన 55 జంటలు

**● పెద్దహరివాణంలో ఘనంగా సామూహిక వివాహాలు**



సామూహిక వివాహాల్లో ఒక్కటైన వధూవరులు

**ఆదోని రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి):** కర్నూలు జిల్లా ఆదోని మండలంలోని పెద్దహరివాణంలో పదకొండేళ్లకోసారి జరిగే గర్జలింగేశ్వర స్వామి మహోత్సవాల్లో భాగంగా దేవస్థానం తరపున ఆదివారం సామూహిక వివాహాలు చేశారు. ఈ సందర్భంగా 55 జంటలు ఒక్కటయ్యాయి. ముందుగానే దరఖాస్తు చేసుకోవడంతో వధూవరులకు దుస్తులు, వధువులకు కాళ్ల మెట్టెలు అందజేశారు. శుభ ముహూర్తం ఉదయం 10:30 గంటల సమయంలో అర్చకులు వధూవరుల బంధువుల మధ్య సామూహిక వివాహాలను ఘనంగా జరిపించారు.

## గోశాలకు విరాళం

**మంత్రాలయం, మే 4(ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన సరోజ అనే భక్తురాలు రూ.లక్ష గోశాలకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.లక్ష నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదంఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీపాదాచార్, అనంతపురాణిక్, జేపీ స్వామి పాల్గొన్నారు.

## సీతారామ్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

**కర్నూలు క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి):** నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీతారామ్‌నగర్‌లో చైన్‌స్నాచింగ్ జరిగింది. గ్రేసీ మైఖేల్ అనే వృద్ధురాలు ఆదివారం రాత్రి తన ఇంటికి సమీపంలో వాకింగ్ చేస్తుండగా.. మోటారు సైకిల్‌పై వచ్చిన ఓఆగంతకుడు రైల్వేస్టేషన్‌కు దారి ఎటూ అంటూ అడిగాడు. ఆమె సమాధానం చెప్పేలోగా ఆమె మెడలోని గొలుసును పట్టుకుని తెంపే ప్రయత్నం చేశాడు. బాధితురాలు అప్రమత్తమై తన చైన్‌ను గట్టిగా పట్టుకుని ఆగంతకుని ముఖానికి ఉన్న మాస్కును తీయబోయింది. దీంతో ఆగంతకుడు తనచేతికి తెగి వచ్చిన చైన్‌తో పరారయ్యాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు.

### చికిత్స పొందుతూ మృతి

**ఆస్పరి, మే 4 (ఆంధ్రజ్యోతి):** ఆటో, స్కూటరు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం పత్తికొండ రోడ్డు వైపు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోలో ప్రయాణిస్తున్న కోసిగమ్మ (52) అక్కడికక్కడే మృతిచెందగా, బిహార్ కి చెందిన మహమ్మద్ జాకీర్ (19) గాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాదుకు తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ జాకీర్ మృతి చెందినట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు.










# రోడ్డు భద్రత ఏదీ..?

**ఏప్రిల్‌లో జరిగిన ప్రమాదాలు కొన్ని**

- ఏప్రిల్ 1వ తేదీన గూడూరు మండలం కె.నాగులాపురం వద్ద లల్లు యాదవ్(34), 6న ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు క్రాస్‌వద్ద దుద్దికి చెందిన ప్రహ్లాద్(30), 11న కోడుమూరు మండలం పులకుర్తి వద్ద గోనేగండ్ల మండలానికి చెందిన హర్ష (20), జయరాజ్ (24), 14న మండల కేంద్రం వెల్దుర్తి వద్ద నేషనల్ హైవేలో రిషికుమార్ (14) రోడ్డు పమాదంలో మృతి చెందారు.
- ఏప్రిల్ 15న కర్నూలు నగరం వై జంక్షన్ వద్ద మహేశ్వరరెడ్డి (44), 17న కోడుమూరు మండలం వర్కూరు సమీపంలో వడ్డే వెంకటరమణ (45), 22న ఆలూరు మండలం పెద్ద హోతూరు వద్ద తండ్రి, కూతరు ఈరన్న, శ్రావణి(14), 28న పెద్దకడుబూరు మండలం హనుమాపురం వద్ద సుమతి(45), 30న కర్నూలు నగరం బళ్లారి చౌరస్తా వద్ద జరిగిన ప్రమాదంలో పరశురాముడు(26) మృతి చెందారు. మెజార్టీగా ఆటో, బైక్ ప్రమాదాలే ఉన్నాయి.
- మే 2న ఆత్మకూరు ప్రమాదంలో ఆదోని, ఎర్రబాడుకు చెందిన గిడ్డయ్య (42), శశికళ (40), లక్ష్మి (28), చంద్రమ్మ (31), కుమార్ (15) మృతి చెందారు. 3న ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట వద్ద జరిగిన ప్రమాదంలో కేశన్న (32), రజాక్ (35) దుర్మరణం పాలైయ్యారు. ఈ రెండు ప్రమాదాల్లో మృతుల కుటుంబాలు రెక్కాడితే తప్పా పూటగడవని పేదలే.

**మూడేళ్లలో జరిగిన ప్రమాదాలు**

| సంవత్సరం | ప్రమాదాలు | మృతులు | గాయపడివారు |
|---|---|---|---|
| 2023 | 135 | 41 | 119 |
| 2024 | 142 | 49 | 153 |
| 2025 మే 4 వరకు | 61 | 31 | 131 |

5వ పేజీ తరువాయి

ప్రమాదాలు ఎక్కడ జరిగినా రోడ్లు భవనాలు శాఖ ఇంజనీరు, రోడ్డు రవాణా శాఖ ఎంవీఐ, పోలీస్ అధికారి ఈముగ్గురు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ప్రమాదానికి రోడ్డు నిర్మాణ లోపమా..? వాహన కండిషన్ లోపమా..? మానవ తప్పిదమా..? నిర్లక్ష్యమా..? త్రీమెన్ కమిటీ స్పష్టమైన వివరాలతో నివేదిక ఇవ్వాలి. ప్రతి నెల జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే జిల్లా 'రోడ్డు సేఫ్టీ కమిటీ' సమీక్షించాలి. రహదారి డిజైన్ లోపం వల్లనే ప్రమాదం జరిగి ఉంటే తక్షణమే మరమ్మతులు చేయాలి. జాతీయ రహదారులకు అయితే రూ.10లక్షల వరకు నిధులు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) పీడీనే మంజూరు చేయవచ్చు. జిల్లా, రాష్ట్ర రహదారులకు అయితే ప్రతిపాదనలు పంపితే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ఇప్పటి వరకు రహదారి భద్రతా సమీక్షలు నామమాత్రంగానే జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి.

### ఆర్థికంగా చితికిపోతున్న అభాగ్యులు

నందవరం మండలం మాచాపురం గ్రామానికి చెందిన ఓ యువ రైతు ఎమ్మిగనూరులో పని ముగించుకొని మోటార్‌బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. పట్టణ శివారులో ముగతి వ్యవసాయ క్షేత్రం వద్ద ఆటో ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా.. యువరైతు తలకు తీవ్రమైన గాయాలకు గురికాగా.. చికిత్స కోసం కర్నూలు నగరంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. రూ.36లక్షలు అప్పులు చేసి ఖర్చుచేశారు. అయినా బతికాడా అంటే అదీ లేదు. రెండు నెలలకే మృత్యుఒడి చేరారు. ఇలాంటి వారెందరో. ప్రమాదాల్లో గాయపడిన బాధితులు భరించలేని వైద్యఖర్చులు, నెలల తరబడి ఉపాధి అవకాశాలు కోల్పోతూ ఆర్థికంగా చితికిపోతున్నారు. దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల మూలంగా ప్రతి ఏటా దేశం జీడీపీలో 3.14 శాతం నష్టపోతున్నామని ఓ జాతీయ సంస్థ సర్వేలో వెల్లడైనట్లు తెలుస్తుంది. బాధిత కుటుంబాలు ఇంటి పెద్దదిక్కును కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

### తక్షణమే మరమ్మతులు చేయిస్తాం

జిల్లాలో ఎక్కడ ప్రమాదం జరిగినా ఆర్‌అండ్‌బీ ఇంజనీరు, ఎంవీఐ, పోలీస్ అధికారి ముగ్గురు ఘటనాస్థలిని పరిశీలించి ప్రమాదానికి కారణాలపై నివేదిక ఇస్తారు. నెలనెల రోడ్ సేఫ్టీపై సమీక్షా చేస్తారు. రహదారి డిజైన్ లోపం వల్లనో, ఇతర రోడ్డు మరమ్మతుల కారణంగానో ప్రమాదం జరిగిందని తెలితే తక్షణమే మరమ్మతులు చేయిస్తాం. రహదారి భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తాం.

- పి.మహేశ్వరరెడ్డి, ఎస్‌ఈ, రోడ్లు భవనాలు శాఖ, కర్నూలు

### అవగాహన కల్పిస్తున్నాం

రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులు, డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. మెజార్టీ ప్రమాదాలు వెమరపాటు వల్ల జరుగుతున్నవే. రెప్పపాటులో ప్రాణాలు కోల్పోతున్నారు. కర్నూలు-కోడుమూరు రహదారిలో ప్రమాద సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగినట్లు గుర్తించాం. తక్షణమే వాటిని ఏర్పాటు చేస్తాం.

- బాబుప్రసాద్, డీఎస్పీ, కర్నూలు

# పశుగ్రాసానికి భలే డిమాండ్

**● ట్రాక్టర్ వరిగడ్డి రూ.17వేల నుంచి 20 వేల దాకా ● ఆందోళనలో రైతులు**



**ఓర్వకల్లు, మే 4 (ఆంధ్రజ్యోతి) :** ఈ ఏడాది పశుగ్రాసానికి భలే డిమాండ్ పెరిగింది. వ్యవసాయానికి తోడు పశువులకు గడ్డి సమస్య తలెత్తింది. గడ్డి వచ్చి పంటల సాగు తగ్గడం కూడా దీనికి ఒక కారణం. మండలంలో వరి సాగు బాగా తగ్గిపోవడంతో పశుగ్రాసానికి డిమాండ్ పెరిగింది. ఓర్వకల్లు, హుశేనాపురం, కాల్వ, కన్నమడకల, కొమరోలు తదితర గ్రామాల్లో వెయ్యి ఎకరాలకు పైగా వరి పంట సాగు చేశారు. వర్షాల కారణంగా దిగుబడి అంతంత మాత్రమే. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. పశువులను రైతులు అమ్ముకోలేక అప్పులు చేసి పశుగ్రాసం కొంటున్నారు. మండలంలో ఎద్దులు, ఆవులు 12 వేలు, గొర్రెలు 47వేలు, గేదెలు 8వేలు, మేకలు 17వేలు ఉన్నాయి. అయితే.. పశుగ్రాసం లేకపోవడంతో నంద్యాల, నూనెపల్లె, గాజులపల్లె, ఆలమూరు, కొణిదేడు, పాణ్యం, గ్రామాల నుంచి ట్రాక్టర్ వరి గడ్డి రూ.17 వేల నుంచి రూ.20 వేల వరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, శనగ, వరితో పాటు ఇతర పంటలు సాగు చేశారు. అయితే పంటలన్నీ వర్షాలకు దెబ్బతినడంతో పశువులకు మేత లేక తల్లడిల్లుతున్నాయి. ఇటీవలే కురిసిన అకాల వర్షాలకు పశువులకు తాగునీరు పుష్కలంగా లభిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పశువులకు నీరు తాగేందుకు నీటి తొట్లు ఏర్పాటు చేసింది. అయితే గడ్డి మాత్రం ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గడ్డి ఉచితంగా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

### రైతులను ఆదుకోవాలి



అధిక వర్షాలతో పంటలన్నీ దెబ్బతిన్నాయి. దీంతో వరి, వేరుశనగ, పప్పుశనగ, మొక్కజొన్న పంటలన్నీ నాశనమయ్యాయి. దీంతో పశువులకు గ్రాసం కొరత ఏర్పడింది. అప్పులు చేసి పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నాం. **- రామకోటేశ్వరరావు, రైతు**

### ప్రభుత్వమే సరఫరా చేయాలి



పశుగ్రాసాన్ని ప్రభుత్వం సరఫరా చేయాలి. ఓర్వకల్లు మండలంలో పశువులకు పశుగ్రాసం లేక సుదూర ప్రాంతాల నుంచి వరిగడ్డిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పశుగ్రాసం ధర ఎక్కువగా ఉంది.

**- కృష్ణారెడ్డి, రైతు**

### పంట దిగుబడి అంతంత..



ఈ ఏడాది పశుగ్రాసం కొరత విపరీతంగా ఉంది. దీంతో పశుగ్రాసానికి భలే డిమాండ్ పెరిగింది. ఓ పక్క కాస్తో.. కూస్తో ఉన్న వరిపై అనేక తెగుళ్ల సోకి పంట దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. కేసీ కెనాల్ కింద సాగు చేసిన ప్రాంతాలకు వెళ్లి వరిగడ్డిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**- శ్రీనివాసులు రైతు**

## డిప్యూటీ సీఎంను బర్తరఫ్ చేయాలి

**● ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుభాన్**



ధర్నా చేస్తున్న ముస్లింలు

**కర్నూలు న్యూసిటీ, మే 4(ఆంధ్రజ్యోతి):** మతాల మధ్య చిచ్చు పెడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను బర్తరఫ్ చేయాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఏ.సుభాన్ డిమాండ్ చేశారు. ఆదివారం పాతబస్తీ ప్రాంతములో జమ్మిచెట్టు వద్ద షేక్ మహ్మద్ అధ్యక్షతన ధర్నా చేపట్టారు. సుభాన్ మాట్లాడుతూ ఒక రాష్ట్రానికి డిప్యూటీ సీఎం స్థాయిలో ఉన్న పవన్‌కళ్యాణ్ ముస్లింలందరూ ఉగ్రవాదులే అని ఒక వర్గానికి కించపరిచే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తక్షణమే పవన్‌కళ్యాణ్ తన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ నిసార్ అహ్మద్, కేవీపీఎస్ నగర కార్యదర్శి గురుస్వామి, మహబూబ్‌బాషా, షేక్‌నూర్ వలి, ఇలియాజ్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## నేడు కార్పొరేషన్‌లో వినతుల స్వీకరణ

**కర్నూలు న్యూసిటీ, మే 4(ఆంధ్రజ్యోతి):** నగర పాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. నిర్దేశిత గడువులోపు పరిష్కారం పొందవచ్చని కమిషనర్ ప్రజలకు సూచించారు.

## రేపు బీచ్ సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

**కర్నూలు స్పోర్ట్స్, మే 4 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర క్రీడా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ఉదయం 8 గంటలకు సుంకేసుల రోడ్డులోని తుంగభద్ర తీరాన రాష్ట్ర స్థాయి బీచ్ సెపక్‌తక్రా ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు తెలిపారు. ఈ ఎంపికలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలను సీనియర్ విభాగంలో స్త్రీ, పురుషులకు ఎంపిక నిర్వహించి ప్రతిభావంతులైన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయడం జరుగుతుంది. ఎంపికైన రాష్ట్ర జట్టు ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని డీయూ ప్రాంతంలో జరిగే జాతీయ స్థాయి ఖేలో ఇండియా బీచ్ సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలి



రోడ్డుపై మురుగునీటిని చూపిస్తున్న కమిటీ సభ్యులు

**కర్నూలు న్యూసిటీ, మే 4(ఆంధ్రజ్యోతి):** నగర పాలక పరిధిలో ఇంటింటి చెత్త సేకరణకు కార్మికుల సంఖ్య పెంచాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కమిటీ సభ్యులు పాతబస్టాండు ప్రాంతంలో పర్యటించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ క్లాప్ ఆటోల ద్వారా ఇంటింటి చెత్తను సేకరించే పనిని కార్మికులతో చేయించడం వల్ల పారిశుధ్య కార్మికుల సంఖ్య కొరత ఏర్పడిందన్నారు. చెత్త సేకరించే వాహనాలను, పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి క్రమం తప్పకుండా మురికి కాలువలను శుభ్రం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ రత్నప్రసాద్, జితేంద్ర, నాయకులు సర్దార్, ఎం.మోహీద్దీన్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం

**కర్నూలు హాస్పిటల్, మే 4 (ఆంధ్రజ్యోతి):** శ్రీశైలం దర్శనాంతరం తిరిగి వస్తూ నంద్యాల జిల్లా భైర్లూటీ సమీపంలో ప్రమాదానికి గురై గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివారం నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రుద్రకోటి సదాశివం, స్టేట్ డైరెక్టర్ పరామర్శించారు. చైర్మన్ మాట్లాడుతూ చనిపోయిన బాధితులకు, గాయాలైన వారికి ప్రభుత్వం నుంచి తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై కలెక్టర్ రంజిత్ బాషాతో మాట్లాడి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూడాలని కోరినట్లు తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీరాములు అడిగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయీ బ్రాహ్మణ స్టేట్ డైరెక్టర్ విజయకుమార్, ఆదోని నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరన్న, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి రంగస్వామి, నాయకులు మునిస్వామి, చిట్టిబాబు పాల్గొన్నారు.

# రైతులను ఉత్తేజ పరిచేందుకే బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న గౌరు వెంకటరెడ్డి

**ఓర్వకల్లు, మే 4 (ఆంధ్రజ్యోతి):** రైతులను ఉత్తేజ పరిచేందుకే దాతల సహకారంతో బండలాగుడు పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమని టీడీపీ సీనియర్ నాయకుడు, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో శ్రీదేవి సహిత భూదేవి సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి పాలపండ్ల బండలాగుడు పోటీలను గౌరు వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ పోటీలకు రెండు రాష్ట్రాల నుంచి 12 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. వీటిని తిలకించేందుకు రైతులు భారీగా తరలివచ్చి కేరింతలు వేస్తూ సంబరాలు చేసుకున్నారు. మొదటి విజేతగా అనంతపురం జిల్లా అక్కంపల్లి గ్రామానికి చెందిన కోనేపల్లి ఇంద్రారెడ్డి ఎద్దులు రూ.50వేలు, రెండో విజేతగా కర్నూలు జిల్లా రేమట గ్రామానికి చెందిన రైతు చిన్నగిడ్డయ్య నాయుడు ఎద్దులు రూ.40వేలు, మూడో విజేతగా తెలంగాణ రాష్ట్రం కొత్తకోట మండలం మల్యాల గ్రామానికి చెందిన డా.గురునాథ్, షైమున్నా ఎద్దులు, రూ.30వేలు, నాలుగో విజేతగా పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు రూ.20వేలు నగదును గెలుచుకున్నాయి. గెలుపొందిన రైతులకు దాతలు నగదును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, ధర్మకర్తలు పల్లె నాగేశ్వరరెడ్డి, సుధాకర్, రమణారెడ్డి, విజయుడు, భరత్, నాగేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న సీహెచ్‌వోల సమ్మె



నిరవధిక సమ్మెలో పాల్గొన్న సీహెచ్‌వోలు

**కర్నూలు హాస్పిటల్, మే 4 (ఆంధ్రజ్యోతి):** తమను రెగ్యులర్ చేయాలని ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనాలు పెంచాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 7వ రోజుకు చేరింది. నగరంలోని శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో ఏపీఎంసీఏ ఆధ్వర్యంలో సీహెచ్‌వోలు దశల వారి ఆందోళనలో భాగంగా దీక్షల్లో కూర్చున్నారు. సీహెచ్‌వోల నిరవధిక సమ్మెకు కర్నూలు సిటీ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా హాజరై సంఘీభావం తెలిపారు. సీహెచ్‌వోలను సమస్యల పరిష్కరించకుండా వారిని తొలగిస్తామని వైద్యఆరోగ్యశాఖ మంత్రి పేర్కొనడం సరికాదన్నారు. బాధలు చెప్పుకోవడానికి వచ్చాక సీహెచ్‌వోల పట్ల మంత్రి బెదిరింపు ధోరణి సరికాదని, వెంటనే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు చందన, వైస్ ప్రెసిడెంటు నాగరాజు, కోశాధికారి కార్తిక్ మాట్లాడుతూ 6 సంవత్సరాలు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని, ప్రతి నెలా వేతనంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లు నెరవేరే వరకు తాము నిరవధిక సమ్మెను కొనసాగిస్తామన్నారు.

# అధిక ఫీజులకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న

**కర్నూలు ఎడ్యుకేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యజమాన్యాలు అత్యధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఈ అధిక ఫీజులకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, యజమాన్యాలు అధిక ఫీజులతో వసూలు చేస్తున్నారని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లితే పట్టించుకోవడం లేదన్నారు. అలాగే పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో.77ను రద్దు చేయాలని, ఉమ్మడి ప్రవేశ పరీక్షలను నిర్వహిస్తామన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకుని యూనివర్సిటీలకే స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరారు. మెడికల్ విద్యార్థులకు శాపంగా మారిన 107, 108 జీవోలను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి మధు, ఉపాధ్యక్షుడు బాలాజీ, సమీర్, అబ్దుల్లా, సామేల్, వీరాంజనేయులు, జగదీష్ పాల్గొన్నారు.

## కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డికి సత్కారం



కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న జనసేన నాయకులు

**కర్నూలు కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి):** తెలుగుదేశం పార్టీ కోడుమూరు నియోజక వర్గం సీనియర్ నాయకుడు డి. విష్ణువర్ధన్‌రెడ్డి కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా జనసేన పార్టీ కోడుమూరు నియోజక వర్గం ఇన్‌చార్జి ఆకెపోగు రాంబాబు విష్ణువర్ధన్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఆదివారం విష్ణువర్ధన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆయనకు శాలువా కప్పి, పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ స్థానిక నాయకులు మౌలాలి, రహమతుల్లా, నాగరాజు, సోమేశ్, విజయ్, రాజు, ప్రకాశ్, ప్రవీణ్, రాము, రంగయ్య పాల్గొన్నారు.

## మేధో వికాసాన్ని పెంచేందుకు పునశ్చరణ తరగతులు



వేసవి పునశ్చరణ తరగతులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాశ్

**కర్నూలు కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన బాలల వేసవి పునశ్చరణ తరగతులను (వేసవి శిక్షణ శిబిరాలు) మేధో వికాసాన్ని పెంపొందించే విధంగా నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్ అన్నారు. ఆదివారం పాతనగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉమ్మడి జిల్లాలోని 56 శాఖా గ్రంథాలయాల్లో నెలకొల్పిన ఈ తరగతులను పాఠశాల స్థాయి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కొనసాగుతున్న మ్యాజిక్ షో, చిత్రలేఖనం, ఆంగ్ల భాషా నైపుణ్యాలు, పుస్తక పఠనం, కథలు చెప్పడం, వినడం తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారి వి. పెద్దక్క, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్ బాషా, ఈశ్వరమ్మ, శిక్షణ ఇచ్చే అధ్యాపకులు బీడీ సుధీర్‌రాజు, యాగంటీశ్వరప్ప, చాంద్‌బీ, ఇందుమతి, ఎస్. రవికిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి



తైక్వాండో కోచింగ్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు, డాక్టర్ శంకర్‌శర్మ

**కర్నూలు స్పోర్ట్స్, మే 4 (ఆంధ్రజ్యోతి):** వేసవిలో సమయం వృథా చేసుకోకుండా సమ్మర్ కోచింగ్ వినియోగించుకోవాలని, తైక్వాండో లాంటి క్రీడలు సాధన చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ సూచించారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపును వీకర్ సెక్షన్ కాలనీలోని సుందరయ్య పార్కు ఆవరణంలో కమిషనర్ రవీంద్రబాబు, డా.శంకర్‌శర్మ ఆదివారం ప్రారంభించారు. సుందరయ్య పార్కు అభివృద్ధి కమిటీ కన్వీనర్ పి.చంద్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుత చదువుతో పాటు క్రీడలను కూడా బ్యాలెన్స్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 6302555345ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహ, తైక్వాండో కోచ్ షబ్బీర్ హుశేన్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



తైక్వాండో శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న రామాంజనేయులు

**కర్నూలు స్పోర్ట్స్, మే 4 (ఆంధ్రజ్యోతి):** స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న చిన్నపాటి పార్కులో ఏర్పాటు చేసిన తైక్వాండో వేసవి శిక్షణా శిబిరాన్ని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లవరం రామాంజనేయులు ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, మాస్టర్లు అజయ్, తేజ, తిలక్, అఖిల, సాయికృష్ణ, శ్రీలలిత, భార్గవ్, మల్లేష్‌లు పాల్గొన్నారు.

## పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి

**● జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్**



శిక్షణలో పాల్గొన్న పిల్లలు, జేవీవీ నాయకులు

**కర్నూలు హాస్పిటల్, మే 4 (ఆంధ్రజ్యోతి):** పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ కుమార్ అన్నారు. రెండు రోజులుగా నగరంలోని బిర్లా కాంపౌండులో జేవీవీ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ అడిక్షన్ శిక్షణ జరిగింది. ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ అడిక్షన్ నుంచి దృష్టి మళ్లించేందుకు వారిలో సృజనాత్మకతను వెలుగు తీసేందుకు శిక్షణ ఎంతో దోహదపడిందన్నారు. ప్రముఖ మేథ మ్యాజిక్స్ స్కిల్స్ అకాడమి డైరెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ పిల్లలు రోజంతా సెల్‌ఫోన్ ఉపయోగించకుండా మనం చిన్న చిన్న వస్తువులతో ఎలా ఆడుపు చేయవచ్చని వివరించారు. జేవీవీ వ్యవస్థాపకులు డా.వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పిల్లలకు సెల్‌ఫోన్‌కు అడిక్షన్ కావడం ద్వారా కంటి, మెడ, వెనముక సమస్యలు తలెత్తుతాయన్నారు. దీని వల్ల రాబోయే కాలంలో పిల్లల్లో సృజనాత్మకత తగ్గుతుందన్నారు. కర్యాక్రమంలో జేవీవీ నాయకులు బాషా, ప్రతాప్ రెడ్డి, రమేష్, పాల్గొన్నారు.

## పోక్సో కేసు నమోదు

**కర్నూలు క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి):** వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. పాతబస్తీకి చెందిన ఓ 15ఏళ్ల బాలిక తీవ్ర కడుపు నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే ఆ బాలికకు మూడు నెలల ప్రెగ్నెసి ఉందని చెప్పడంతో బంధువులు షాక్‌కు గురయ్యారు. ఆ బాలిక తనపై జరిగిన లైంగిక దాడి గురించి చెప్పలేకపోయింది. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కూడా బాలికపై జరిగిన లైంగిక దాడి గురించి ఆరాతీశారు. బాలికకు మాత్రం షాక్‌లో ఉండడంతో పూర్తిగా వివరాలు చెప్పలేకపోతుంది. దీంతో గుర్తు తెలియని వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తులో వివరాలు సేకరిస్తామని సీఐ రామయ్య నాయుడు తెలిపారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పర్లలో పూర్వ విద్యార్థులు కలుసుకున్న దృశ్యం

**కల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి):** పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయిక ఘనంగా నిర్వహించారు. ఆదివారం 2004-05 పది తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఆప్యాయంగా కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పర్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విశ్రాంత గురువులు హాజరయ్యారు. బెత్తం పట్టి విద్యా బుద్ధులు నేర్పిన గురువుల ముందు మళ్లీ విద్యార్థులుగా మారి చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు గురువులకు ఘనంగా సన్మానించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పాండురంగయ్య, సంపత్, ద్వారకానాథ్ శాస్త్రి, మల్లికార్జున, యాసీన్ బాషా, నీలకంఠేశ్వరరెడ్డి, శ్రీధర్‌బాబు, నగేష్, సత్యనారాయణమూర్తి, నబిషా, గోదాదేవి, జ్యోతి పాల్గొన్నారు. ఆర్గనైజర్స్ పరుశురాం, వెంకటేష్, శివ, సరోజ పాల్గొన్నారు.

**కోడుమూరు రూరల్:** సమాజంలో గురుశిష్యుల అనుబంధం ఎంతో గొప్పదని ఉపాధ్యాయులు తెలిపారు. లద్దగిరి ఉన్నత పాఠశాలలో 1999-2000 ఏడాది పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గురువులు వీరేశప్ప, యోగేంద్రబాబు, శాంతమూర్తి, వీరబ్రహ్మయ్య, సుహాసిని, విజయవాణిలను దుశాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం పూర్వవిద్యార్థులు ఒకరినొకరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనారోగ్యంతో మృతి చెందిన పుట్టపాశం కుమార్ కుటుంబానికి రూ. 10 వేలు సాయమందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంగాధర్, నబి, వెంకటేశ్, పట్టి మధు, ఈశ్వరయ్య, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



లద్దగిరిలో ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

## తాటి ముంజలతో ఉపశమనం



### తాటి ముంజల్లో పోషకాలు అధికం



తాటి ముంజల్లో అధిక పోషకాలు ఉన్నాయి. ఇవి వేసవి తాపం నుంచి ఉపశమనంతో పాటు పోషకాలు ఇస్తాయి. నీరు, కార్బోహైడ్రేడ్, ప్రొటీన్స్, పీచు పదార్థాలు ఉండటంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. - డాక్టర్ కె.వినోద్ కుమార్, వైద్యాధికారి, అర్బన్ సెంటర్, ఆదోని



ఆదోనిలో తాటి ముంజలను విక్రయిస్తున్న గ్రామస్థులు

ఆదోని అగ్రికల్చర్, మే 4 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మండే ఎండలే కాదు, మధుర ఫలాలు కూడా లభిస్తాయి. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లోని పెద్ద తుంబలం, చిన్న తుంబలం, జాలమంచి, పెద్దకడబూరు, గవిగట్టు, కోసిగి గ్రామాల్లో తాటివనాలు విస్తారంగా ఉన్నాయి. గ్రామస్థులు అక్కడి నుంచి తాటి ముంజలను పట్టణానికి తెచ్చి విక్రయిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, శివారు ప్రాంతాల్లోని రహదారుల వద్ద వీటిని విక్రయిస్తున్నారు. డజన్ రూ. 60నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనానికి వినియోగదారులు తాటి ముంజలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

### ముంజల్లో 87శాతం నీరు..

వేసవిలో మాత్రమే లభించే తాటిముంజలను మధుర ఫలంగానూ పేర్కొంటారు. ముంజల్లో 87 శాతం నీరు ఉంటుంది. వీటిలోని పోషక విలువలు వడదెబ్బ నివారణకు, శరీర ఉష్ణోగ్రతలను తగ్గించడానికి ఉపయోగపడతాయి. తాటిముంజల లోపటి తెల్లని పదార్థం వేసవి తాపం నుంచి రక్షిస్తుంది. అలాగే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

## తుగ్గలి మండల ఈసీగా రాజశేఖర్



తుగ్గలి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కన్సల్టెంట్ ఇంజనీరింగ్ ఇన్‌చార్జి (ఈసీ)గా రాజశేఖర్‌ను నియమించినట్లు ఏపీవో హేమసుందర్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ తుగ్గలి ఈసీగా పనిచేస్తున్న ప్రదీప్‌కుమార్ పత్తికొండకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో తుగ్గలిలో పని చేస్తున్న టీఏ రాజశేఖర్‌ను ఇన్‌చార్జి ఈసీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

## మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

దేవనకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి 18 వరకు తిరుపతిలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. నర్సారావ్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, రామాంజినేయులు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు

క్రిష్ణగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోయిలకొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ గుడిలో విగ్రహాన్ని ఆదివారం వేద పండితులు ప్రతిష్ఠించారు. రెండు రోజులుగా గుడిలో అర్చకులు పూజలు నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రతిష్ఠలో పాల్గొన్ని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు నారాయణ, పాల రాజు, గొల్ల బోయిని నాగేష్, సర్పంచ్ లక్ష్మి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## అన్ని పంటలకు పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

మద్దికెర, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రబీ, ఖరీఫ్‌లో అన్ని పంటలు దెబ్బతిన్నాయని పంట నష్ట పరిహారం అన్ని పంటలకు వర్తింపజేయాలని జడ్పీటీసీ సభ్యుడు మురళిధర్ రెడ్డి, వైసీపీ కన్వీనర్ మల్లికార్జున యాదవ్ కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 25వేల హెక్టార్లలో వేరుశనగ, శనగ, పత్తి, వాము, జొన్న సాగు చేస్తొన్నారు. అయితే ప్రభుత్వం కేవలం పప్పుశనగ, జొన్నకు మాత్రమే పంట నష్ట పరిహారం ఇస్తున్నారని మిగతా పంటలకు కల్పించకపోవడం అన్యాయమన్నారు. పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. 2024-25 సీజన్‌లో ప్రతి రైతుకు పంట నష్టం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 2023-24 సంవత్సరానికి బీమా పరిహారాన్ని జమ చేయాలని కోరారు. బండారు ఆంజనేయులు, కృష్ణ యాదవ్ ఉన్నారు.

## వృషభం మృతి.. నష్టపోయిన రైతు



మృతి చెందిన వృషభం

చిప్పగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌల్తాపురం గ్రామానికి చెందిన పెద్ద వెంకటప్ప గారి హనుమన్నకు చెందిన వృషభం ఆదివారం అస్వస్థతతో మృతి చెందింది. బాధితుడి తెలిపిన వివరాలు.. నాలుగు నెలల క్రితం పత్తికొండ సంతలో రూ.1.60లక్షలతో వృషభాలను కొన్నాడు. అయితే ఒక వృషభం ఆదివారం శ్వాస ఆడక మృతి చెందింది. మిరపసాగు చేసి రూ.6లక్షలు పెట్టుబడి పెట్టి నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు, గ్రామస్థులు కోరారు.

## టీడీపీ నాయకుడి మృతి



నాగరాజు(ఫైల్)

ఆలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు గద్దం నాగరాజుస్వామి(70) ఆదివారం మృతిచెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. గుండెపోటు రావడంతో ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. ఆయనకు భార్య మూర్తమ్మ, కుమారుడు కిరణ్ ఉన్నారు. టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, రామ్‌నాథ్‌యాదవ్, ఏబీసీ కెనాల్ డీసీ చైర్మన్ నగరజీణ కిష్టప్ప, కన్వీనర్ అశోక్, టీడీపీ నాయకులు నరసప్ప, నారాయణ, కొమ్ము రామాంజనేయులు, ముద్దురంగ, సోమశేఖర్, హనుమప్ప సంతాపం తెలిపారు.

## ముగిసిన ఉత్సవాలు

పత్తికొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఉత్స వాలు ఆదివారం ముగిశాయి. కమిటీ చైర్మన్ అమరావతి శివరామకృష్ణయ్య నేతృత్వం లో గత నెల 30న ప్రారంభమైన ఉత్సవాలు ఐదు రోజు లుగా వరుసగా వివిధ పూజా కార్యక్రమాలు, కల్యాణోత్సవం, రథోత్సవ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. శనివారం అర్ధరాత్రి నాలుగు స్థంభాల మండపంలో పల్లకి సేవ కన్నుల పండువగా సాగింది. ఆదివారం ప్రత్యేక పూజలు చేసి రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అమరావతి శివరామకృష్ణయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు చిత్రాల శేఖర్, న్యాయవాది సత్యనారాయణ, చక్కా గోపాల్, సుమంత్, భక్తులు పాల్గొన్నారు.



ఊయల సేవ నిర్వహిస్తున్న భక్తులు

## విద్యతోనే భవిష్యత్తు

- బుగ్గ తండాలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో అవగాహన.. విద్యార్థులకు బహుమతులు



ప్రతిభ కనపరచిన విద్యార్థులతో సభ్యులు

పత్తికొండ, మే 4(ఆంధ్రజ్యోతి): విద్యతోనే భవిష్యత్తు సాధ్యమని కర్నూలు పంచాయతీ రాజ్ డీఈఈ హరిదాసు ఈరన్న, ఇరిగేషన్ డీఈ కృష్ణనాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని బుగ్గతండాలో జిల్లా గిరిజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పహల్గామ్ ఉగ్రదాడిలో చనిపోయిన 28 మంది భారతీయులకు సంతాపం తెలిపారు. వారు మాట్లాడుతూ ఒకప్పుడు గిరిజన తండాలో చదువుకోవడానికి విద్యార్థులు ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పించిందన్నారు. విద్యార్థులు చదువులో ప్రతిభ చూపి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సహకరిస్తా యన్నారు. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరచిన గిరిజన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో యువస్పందన సొసైటీ సెక్రటరీ నాగరాజు, ఉపాధ్యాయులు లోక్యనాయక్, రంగస్వామి నాయక్, వెంకటేశ్ నాయక్, ఏఈఈ రంగనాయక్, స్వామినాయక్, వేల్ఫేర్ అసిస్టెంట్ వెంకటరమణ, ఉపసర్పంచ్ జ్యోతి, గ్రామపెద్దలు గోద్రెనాయక్, దానానాయక్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరిజ్ఞానం అవసరం



విద్యార్థులతో ఫెయిత్ హోమ్ నిర్వాహకులు

ఆదోని అగ్రికల్చర్, మే 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని ఫెయిత్ హోమ్ వ్యవస్థాపకుడు రెవరెండ్ డాక్టర్ డానియల్ ప్రేమ్ కుమార్ అన్నారు. ఆదివారం సమ్మర్ క్యాంప్‌లో భాగంగా కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను రాయచోటి సుబ్బయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రతి విద్యార్థి కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్ తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు. ఇందుకు పీపుల్స్ పాఠశాల కృషి చేస్తుందని, విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీ వాణి, నీలం బండారి, సంగటి ప్రేమ్ కుమార్, నాయుడు, జైపాల్, అనిత పాల్గొన్నారు.

## స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోనిటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆవోపా తరఫున ఆదివారం చిన్నారులకు స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేశారు. వికాస తరంగిణి సహకారంతో ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ సౌజన్యంతో 218 మంది చిన్నారులకు అందజేశారు. ఈ మందు రోగ నిరోధక శక్తి కలిగి ఉందని సంస్థ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. సంస్థ సభ్యులు రఘు, యాదగిరి, వెంకటేశ్వర్లు, వంకదారు మమతాశ్రీలు పాల్గొన్నారు.



మందు వేస్తున్న సంస్థ సభ్యులు

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

తుగ్గలి, మే 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. ఆదివారం జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుబయట మద్యం తాగుతున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు. పబ్లిక్ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే అందరికీ ఇబ్బందులు వస్తాయని, అలాగే నిషేధిత ప్రాంతాల్లో మద్యం తాగకూడదన్నారు. తాగి నడిపితే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు.

## గుంతను పూడ్చారు



గుంతను పూడ్చుతున్న కార్మికుడు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోయనగర్ ప్రధాన రహదారిలో గుంతను పంచాయతీ సిబ్బంది ఆదివారం పూడ్చివేశారు. ఆంధ్రజ్యోతి పత్రికలో ఆదివారం 'ఆదమరిస్తే అంతే' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ రావు గుంతను సిబ్బందిని పంపి గుంతను పూడ్చివేయించారు.

## అతి వేగం ప్రమాదకరం : ఎస్ఐ

మద్దికెర, మే 4 (ఆంధ్రజ్యోతి): అతివేగం ప్రమాదకరమని ఎస్ఐ విజయకుమార్‌నాయక్ హెచ్చరించారు. ఆదివారం గ్రామ శివార్లలో వాహనాలను తనిఖీచేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనాల పత్రాలు కలిగి ఉండాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి నడపవద్దని సూచించారు.

## వాహనం బోల్తా...

దేవనకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భారత్ పెట్రోలియం పంపు వద్ద బొలేరో ట్రాలీ వాహనం బోల్తా పడింది. వివరాల మేరకు.. కూరగాయ లతో కర్నూలుకు వెళుతుండగా అదుపు తప్పి బోల్తాపడింది. ఎవరు లేకపోవడం తో ప్రమాదం తప్పింది. మద్యం సేవించి వాహనం నడిపినందుకే ప్రమాదం చోటుచేసుకొందని స్థానికులు డ్రైవర్‌పై మండిపడ్డారు.

## సభ్యుడిగా అవకాశమివ్వాలి

ఆలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ట్రస్టుబోర్డు సభ్యుడిగా ఆలూరుకు చెందిన శివప్రకాష్‌ను నియమించాలని మార్కెట్ మాజీ చైర్మన్ పంపాపతి కోరారు. ఆదివారం హొళగుందలో విలేకరులతో మాట్లాడుతూ వీర శైవ లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన శివప్రకాష్ టీడీపీకి మొదటి నుంచి సేవలు అందిస్తున్నారన్నారు. టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, ఎంపీ, ఎమ్మెల్యేలు సహకరించాలన్నారు. ఎర్రిస్వామి, దిడ్డి వెంకటేష్, తిప్పన్న, జెడ్పీ విద్యా కమిటీ చైర్మన్ ద్వారక, జాకీర్, యువ నాయకుడు మంజునాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

## యోగాతో వికాసం

మద్దికెర, మే 4 (ఆంధ్రజ్యోతి): యోగాతో మనో వికాసం వస్తుందని నిర్వహకుడు పోలీ ఫక్కీరప్ప అన్నారు. ఆదివారం వశిష్ట పాఠశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. రోజూ యోగా చేయడం వల్ల ప్రశాంతత వస్తుందని తెలిపారు.

## సమయం ఇవ్వాలి

ఆదోనిటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): బిల్లులను చెల్లించలేదని విద్యుత్ కనెక్షన్‌ను వెంటనే తొలగించడం భావ్యం కాదని మైనార్టీ హక్కుల పోరాట సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ ఆది వారం అన్నారు. ఎండాకాలం విద్యుత్ లేకుంటే వృద్ధులు, పిల్లలు, వ్యాధిగ్రస్తులు ఇబ్బంది పడతారని ఆవేదన వ్యక్తం చేశారు.

## సోలార్‌తో విద్యుత్ ఆదా చేసుకోండి



పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

మద్దికెర, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల ప్రజలు తమ ఇళ్లపై సోలార్ పానెళ్లు ఏర్పాటుచేసుకుని విద్యుత్ ఆదా చేసుకోవాలని విద్యుత్ డీఈ ఖాజావలి అన్నారు. ఆదివారం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోలార్ విద్యుత్ పోస్టర్లను విడుదల చేశారు. గృహ విద్యుత్ వినియోగదారులకు బిల్లులు తగ్గించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ కింద సోలార్ పానెళ్లు ఇస్తారని తెలిపారు. పానెళ్ల ఏర్పాటుతో ఏమైనా అవుతుందన్న అపోహలు వీడనాడాల న్నారు. విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ, లైన్‌మెన్లు వెంకటరమణ, రంగన్న, తదితరులు ఉన్నారు.

## రహదారికి మహర్దశ

- రూ.కోటి నిధులు మంజూరు

హాలహర్వి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట-కొక్కరచేడు, బేవినహాల్, శ్రీదర్‌హాల్, సాకిబండ రహదారి నిర్మాణానికి నాబార్డు నిధులు రూ. కోటి మంజూరయ్యాయి. ఏళ్లుగా రహదారి లేక నరకం అనుభవించిన గ్రామ ప్రజలు టీడీపీ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు పంచాయతీరాజ్ జేఈ సోమప్ప తెలిపారు. గూళ్యం-బల్లూరు, ఛత్రగుడి నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రహదారికి ప్రతిపాదనలు పంపామని, త్వరలో వీటికి కూడా నిధులు మంజూరవుతాయని తెలిపారు.



నిధులు మంజూరైన సాకిబండ రహదారి ఇదే

## గర్జలింగేశ్వర మహోత్సవం

ఆదోని రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో 5వ గర్జలింగేశ్వర మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. గర్జలింగేశ్వర అయ్యమ్మ ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఎమ్మెల్యే పార్థసారధి, మాజీ ఎమ్మెల్యేలు మీనాక్షి నాయుడు, సాయిప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. తాలుక సీఐ నల్లప్ప బందోబస్తు ఏర్పాటు చేశారు.

## టీడీపీ సభ్యత్వంతో రూ.10లక్షల పరిహారం



చెక్కు అందజేస్తున్న మీనాక్షినాయుడు

ఆదోని, మే 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద మృతులకు టీడీపీ సభ్యత్వం ఉండటంతో బాధిత కుటుంబానికి రూ.10 లక్షల బీమా పరిహారం మంజూరైనట్లు ఆ పార్టీ ఆదోని ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదివారం అన్నారు. నాలుగు నెలల క్రితం కుప్పగల్లు గ్రామానికి చెందిన పూజారి ఈరన్న, ఆదిలక్ష్మి దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, వారిద్దరికీ టీడీపీ సభ్యత్వం ఉండటంతో పరిహారంఇవ్వాలని రాష్ట్ర కార్యాలయం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇద్దరికీ సభ్యత్వం ఉండటంతో ఒక్కొక్కరికి రూ.5లక్షల ప్రకారం మొత్తం రూ.10లక్షలు ఇప్పించామన్నారు. బాధితులు, గ్రామ టీడీపీ నాయకులు మీనాక్షి నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

## నిష్పత్తి మేరకు ఉపాధ్యాయులను నియమించాలి

ఆదోని అగ్రికల్చర్, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక తరగతుల విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని ఎస్టీయూ జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్ నాగేంద్రప్ప డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీయూ భవనంలో డివిజన్ నాయకుల అత్యవసర సమావేశం శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. పాఠశాల విద్యాసంస్కరణలలో భాగంగా ప్రాథమిక తరగతుల ఉపా ధ్యాయ, విద్యా ర్థులు ఒకే నిష్పత్తిలో ఉండాలని కోరారు. ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక తరగతులకు మిగిలిన ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తిలో తేడాలు ఉండేలా చేస్తోందని, ఇది సరికాదన్నారు. ఎం శ్రీనివాసులు, కాశీ విశ్వనాథ శాస్త్రి, జ్యోతి మూర్తి నారాయణ పాల్గొన్నారు.

## నేర ప్రవృత్తిని మానాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ మల్లికార్జున

తుగ్గలి, మే 4 (ఆంధ్రజ్యోతి): నేర ప్రవృత్తిని మానుకోవాలని తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు కృష్ణమూర్తి, మల్లికార్జున సూచించారు. ఆదివారం తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లు, మట్కా బీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడటం, అల్లర్లు సృష్టించడం వల్ల గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు వస్తే సత్ప్రవర్తన కింద వారిపై రౌడీషీట్లను ఎత్తివేస్తామన్నారు.

## అభివృద్ధి మండలి ఏర్పాటు చేయాలి

పత్తికొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ తరతరాలుగా రాయలసీమకు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. గిరిజన విశ్వవిద్యాలయం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, కేంద్ర సంస్థలను మంజూరు చేయాలన్నారు. రెండుసార్లు రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ కడప ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేయకపోవడం విచారకరమన్నారు. అమరావతి రైతుల త్యాగాలను గొప్పగా చెప్పుకున్న నాయకులు సీమ రైతుల బాధలు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న శివలక్ష్మి

పత్తికొండ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఈశ్వర్ రెడ్డి భవన్‌లో ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ఎన్నో పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి హక్కులను కాలరాశారన్నారు.

## సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్‌రావు



ఆలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పర్యావరణ, ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వం నిషేధించిందని డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్‌రావు తెలిపారు.

**ప్రశ్న:** ప్లాస్టిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
**జవాబు:** ఆలూరు పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వాడకంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జరిమానాలు విధిస్తాం. హోటళ్లలో ఇడ్లీ తయారీకి పాత్రలో ప్లాస్టిక్ పేపర్ వాడుతున్నారు. తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తాం, ప్రజలు సహకరించాలి.

**ప్రశ్న:** అనుమతి లేకుండా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వీటి నియంత్రణకు చర్యలు తీసుకున్నారా?
**జవాబు:** ఆలూరు పట్టణంలో తనిఖీ చేసి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్‌లపై విచారణ చేసి, యజమానులపై చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న:** పట్టణంలోని మెయిన్ స్కూల్ వద్ద రోడ్డు పక్కనే మాంసం విక్రయిస్తున్నారు. విక్రయదారులు మాంసం వ్యర్థాలను పాఠశాలలో పడేస్తున్నారని సమాచారం. ఈ విషయంలో చర్యలు తీసుకున్నారా?
**జవాబు:** గతంలోనే హెచ్చరించాం. మాంసం వ్యాపారులను సంతమార్కెట్‌లోకి తరలిస్తాం. .

**ప్రశ్న:** శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఏళ్లుగా ఖాళీగా ఉంది కదా?
**జవాబు:** శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు భర్తీకి ప్రభుత్వానికి నివేదిక పంపించాం. పంచాయతీ వారే పర్యవేక్షణ చేస్తున్నారు.

**ప్రశ్న:** ఈ వేస్ట్ కేంద్రాన్ని ప్రజలు ఉపయోగించుకుంటున్నారా?
**జవాబు:** ఆలూరు పంచాయతీ కార్యాలయంలో ఈ వేస్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ప్రజలు పాత, పనికి రాని వస్తువులు ఇక్కడ తెచ్చి ఇస్తే వాటిని జిల్లా కేంద్రానికి తరలిస్తాం.

## రూ.10 లక్షలతో గోపుర నిర్మాణం


తయారు చేయించిన కలశాలు

ఎమ్మిగనూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవందిన్నె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి గోపురాన్ని గ్రామ పెద్ద జానకిరామిరెడ్డి రూ.10లక్షలతో నిర్మించారు. కొత్తగా నిర్మించిన గోపురానికి ఆదివారం రూ.2లక్షలతో తయారు చేయించిన కలశాలతో అలంకరించారు. ముందుగా ఆలయ పూజారులు సత్యనారాయణస్వామి, శేఖర్‌స్వామి తెల్లవారుజాము నుంచి స్వామివారికి జలాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చన, మహాగణారాధన, మహా మంగళహారతి, ప్రత్యేక అలంకరణలు చేశారు. గ్రామంలోని భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పెద్ద జానకిరామిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## వాహనదారుల అవస్థలు


ఉరుకుంద రోడ్డులో అడ్డంగా పడిపోయిన పశుగ్రాసం

కోసిగి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుంగభద్ర నదీతీర గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా పశుగ్రాసాన్ని వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఆదివారం తుంగభద్ర నదీతీర గ్రామాల నుంచి ట్రాక్టరులో తీసుకెళ్తున్న పశుగ్రాసం అధిక లోడు వల్ల కోసిగిలోని ఉరుకుంద రోడ్డు పెట్రోల్ బంకు సమీపంలో ప్రధాన రోడ్డుపై పడిపోవడంతో వెనుకనుంచి వస్తున్న వాహనాలు అక్కడే రోడ్డుపై నిలబడిపోయాయి. పశుగ్రాసం మిషన్లలో వేయడం వల్ల కటింగ్ అయిన తర్వాత చిన్నసైజులో ఉండి ట్రాక్టర్లలో లోడు నిలబడలేకపోతుందని ట్రాక్టర్ల యజమానులు తెలిపారు. పశువులకు వేయాల్సిన పశుగ్రాసం ఇలా రోడ్డుపాలవుతుందని కొందరు తెలుపుతున్నారు.

## శరవేగంగా కల్వర్టు పనులు


జుమాలదిన్నె- ఉరుకుంద రోడ్డులో చురుగ్గా జరుగుతున్న కల్వర్టు పనులు

కోసిగి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జుమాలదిన్నె గ్రామ సమీపంలో ఉరుకుందకు వెళ్లే ప్రధాన రోడ్డు కల్వర్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్అండ్‌బీ డీఈ నాగరాజు, ఏఈ నరేష్ కల్వర్టు రోడ్డు పనులను పరిశీలించారు. ఈ ఏడాది శ్రావణమాసానికల్లా కల్వర్టు రోడ్డు పనులు పూర్తి చేస్తామని, ఉరుకుందకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు. నిత్యం ఉరుకుందకు మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, రాష్ట్రాల నుంచి ఇదే రోడ్డు గుండా వెళ్తుండటంతో త్వరితగతిన కల్వర్టు పనులు పూర్తి చేస్తున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు.

## బసవన్న కొండపై భారీ మంటలు


బసవన్న కొండపై మంటలు

కోసిగి, మే 4 (ఆంధ్రజ్యోతి): కోసిగి గ్రామ సమీపాన ఉన్న బసవన్న కొండలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో రెండు రోజులుగా కొండలో భారీఎత్తున మంటలు ఎగిసి పడుతున్నాయి. రెండు రోజుల నుంచి కొండపై మంటలు వ్యాపించాయని గొర్రెల కాపరులు, పశువుల యజమానులు తెలిపారు. కోసిగి చెందిన సుమారు 300 గొర్రెలు, వంద మేకలతో గొర్రెల కాపరులు బసవన్న కొండపై మేతను మేపేందుకు వెళ్లగా.. ఆకస్మాత్తుగా పెద్దఎత్తున మంటలు వ్యాపించడంతో ప్రాణభయంతో గొర్రెల కాపరులు గొర్రెలు, మేకలను తీసుకుని కిందకు దిగడంతో ప్రాణాలతో బయటపడ్డామని, సమీప పొలాల్లోని రైతులు, పశువుల యజమానులు కూడా కొండపై నుంచి కిందకు చేరినట్లు తెలిపారు. కొండ సమీపంలోని రైతులు కూడా దట్టమైన పొగలు కమ్మేయడంతో పొలాల్లోని పశుగ్రాసం, కల్లాలు కాలిపోతాయని ఆందోళన చెందుతున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు కార్చిచ్చును అదుపులోకి తీసుకురావాలని కోసిగి ప్రజలు కోరుతున్నారు.

## విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


మాధవరంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మంత్రాలయం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. ఆదివారం విద్యార్థులు ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక పై నాటి రిటైర్డు హెచ్‌ఎం ముకురన్న, సీ.బెళగల్ ఎంఈవో ఆదాంబాషా, ఎమ్మిగనూరు బాలికల పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి, బనగానపల్లె టంగుటూరు పాఠశాల హెచ్‌ఎం పర్వీన్‌బాను, శ్రీదేవి, గోపాల్, అనురాధ, జయరాజు, భీమన్నలను ఘనంగా సత్కరించారు. దాదాపు ఇరవై ఏళ్ల తర్వాత కలుసుక్ను సందర్భంగా 2004-05 బ్యాచ్ కన్వీనర్లు భీమిరెడ్డి, బసవరాజు, తిరుమల్‌నాయుడు, మధు, ప్రవీణ్ కుమార్, మౌనయ్య ఆచార్, బీజే రాజు, ఎండీ నరసింహులు, గుంటప్ప, కృష్ణ రమ్యశ్రీ, వనిత, సంధ్య మాట్లాడారు. తమను ఉన్నత శిఖరాలకు చేర్చిన గురువుల రుణం తీర్చుకోలేనిదని కొనియాడారు. అనంతరం గురువులను పూర్వ విద్యార్థులు ఊరేగించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భీమేష్, రవికుమార్, వీరేష్, భారతి, సంధ్య, నరసమ్మ, విజయలక్ష్మి, నరసింహులు, మంజునాథాచార్, నరసప్ప, అల్లి సురేష్, నరసింహులు ప్రేమమ్మ, ప్రమోద్ కుమార్, కృష్ణ, హెబ్సిబా నస్రీన్, సోఫియా, అక్షర తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య

● ఇబ్బందులు పడుతున్న ఇందిరానగర్ వాసులు


ఇందిరానగర్‌లో నీరు రాకుండా నిరుపయోగంగా ఉన్న పైపులైన్

ఎమ్మిగనూరు టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్‌లో ప్రజలు నీటి కోసం కష్టాలు పడుతున్నారు. వీధిలోని రెండో లైన్‌లో తాగు నీటి కోసం ప్రజలు అష్ట కష్టాలు పడుతున్నారు. పైపు లైన్ ఉండి కూడా నీరు రావడంలేదని ప్రజలు వాపోతున్నారు. వాటర్ సప్లై పైపు లైన్ ఉండి కూడా నిరుపయోగంగా ఉంచారని కాలనీవాసులు వాపోతున్నారు. రెండు సంవత్సరాలుగా తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు నీటి కష్టాలు తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

### రెండు సంవత్సరాల నుంచి నీటి సమస్య



మాకు రెండు సంవత్సరాల నుంచి చుక్క నీరు రావట్లేదు. మా లైన్‌కు, పెద్ద పైపు లైన్ ఉన్న కూడా చుక్క నీరు రావట్లేదు. ఎండా కాలం చాలా దూరం వెళ్ళి తాగే నీళ్లు తెచ్చుకొవాల్సిన పరిస్థితి, మేము కూలి పనికి పోయి వచ్చే లోపు నీళ్లు బంద్ అయిపోతున్నాయి.

-వడ్డే లక్ష్మమ్మ

### అధికారులు స్పందించాలి



తాగడానికి నీళ్లు లేక మా లైన్ మొత్తం చాలా ఇబ్బందులు పడుతున్నాం. రెండు సంవత్సరాల నుంచి నీటి కష్టాలు తప్పడం లేదు. అధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలి.

-నూర్జహాన్

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు


ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, పాలు అందిస్తున్న సగరులు


కోసిగిలో భగీరథ మహర్షి జయంతిలో పాల్గొన్న ఉప్పర కుల సంఘం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు పట్టణం నందు సగరుల కుల దైవం భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణ ఉప్పర సగర సంఘం అధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి యు యం బాలాజీ అధ్యక్షతన ఉప్పర కళ్యాణ మండపం నందు సంఘం అధ్యక్షుడు బసరకోడు వీరేంద్ర, భగీరథ మహర్షి విగ్రహనికి పాలాభిషేకం చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సంధ్బంగా వీరేంద్ర,బాలాజీ మాట్లాడుతూ సగరులు ఐక్యంగా ఉండాలని, రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా సగరులు అన్ని రంగాలల్లో అభివృద్ధి చెందాలని అకాంక్షించారు.సగర బాంధవులకు ఏదైనా సమస్య వస్తే సంఘం ఎల్లప్పుడూ ముందు ఉంటుందని తెలియజేశారు .అనంతరం శ్రీ శ్రీ భగీరథ మహర్షి చిత్రపటంతో రామస్వామి దేవాలయం నుండి పుర వీధుల గుండా సోమప్ప సర్కిల్, గాంధీ సర్కిల్ మీదగా ఊరేగింపుగా వెళ్ళి శ్రీ రామస్వామి దేవాలయం చేరుకున్నారు .ఈ ఊరేగింపులో సగరులు భారీగా పాల్గొన్నారు .అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు, రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంచి, దేవాలయం నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బండ్ల హరి, జాయింట్ సెక్రటరీ యు.వై యల్లప్ప, కోశాధికారి యుయం మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరి చరణ్, యు. రమేష్, యు. వీరేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పర కులస్థుల ఆరాధ్య దైవం..**

కోసిగి: ఉప్పర కులస్థుల ఆరాధ్య దైవమైన భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఆదివారం కోసిగిలో ఉప్పర కులస్థుల ఆధ్వర్యంలో కోసిగిలోని ఊరువాకిలి వద్ద భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పర కులసంఘం నాయకులు ఈరన్న, బసవరాజు, లక్ష్మన్న, వీరేష్ మాట్లాడుతూ ఉప్పర కులస్థులను రిజర్వేషన్ బీసీ-డీ నుంచి బీసీ-ఏకి మార్చాలని డిమాండ్ చేశారు .ఉప్పర కులస్థులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడ్డారని ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## కోసిగిలో దంచి కొడుతున్న ఎండలు


నిర్మానుష్యంగా తేరుబజారు రోడ్డు


దుకాణాలు మూసివేసిన వ్యాపారులు

కోసిగి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలో వేసవి కాలం ప్రారంభం నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల నుంచి కోసిగిలో ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 డిగ్రీల వరకు నమోదు అవుతుండటంతో మధ్యాహ్నం 12 లేదా 1 గంటలకే రోడ్లపై ప్రజలు తిరగడం లేదు. ప్రధాన రోడ్లు సైతం నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కోసిగిలోని వ్యాపార వాణిజ్య కేంద్రంగా ఉన్న తేరుబజారు మైదానంలో ప్రజలు ఎండవేడిమికి తాళలేక వ్యాపారస్థులు బయట కనిపించకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనం ఇస్తున్నాయి. కొందరు వ్యాపారస్థులయితే మధ్యాహ్నం 2గంటలకే దుకాణాలు మూసి వేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మరలా సాయంత్రం ఎండలు తగ్గిన తర్వాత షాపులు తెరుస్తున్నారు. గత ఏడాదిలో ఎప్పుడూ నమోదు కాని ఉష్ణోగ్రతలు ఈ ఏడాది కోసిగిలో నమోదు అవుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ముఖ్యంగా స్థానిక రైల్వేగేటు ఇరువైపులా, ఆర్టీసీ బస్టాండు సమీపంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## తుంగభద్ర నదిలోకి కలుషిత నీరు


తుమ్మిగనూరు, రొయ్యల చెరువుల నుంచి తుంగభద్ర నదిలోకి వెళ్తున్న కలుషిత నీరు

కోసిగి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మిగనూరు గ్రామ సమీపంలో ఉన్న రొయ్యల చెరువుల నుంచి రసాయనాల కలుషిత నీరు తుంగభద్ర నదిలో కలవడంతో కలుషితం అవుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎస్ఎస్‌పీ వాటర్ స్కీం వద్ద కలుషిత నీరు చేరుతోంది. దీంతో సాతనూరు, అగసనూరు, తుమ్మిగనూరు, చిర్తనకల్, దుద్ది, కోసిగి గ్రామాల ప్రజలు ఈ నీరు తాగి వాంతులు, విరేచనాలతో ఆసుపత్రి పాలయ్యారు. తుమ్మిగనూరులోని రొయ్యల చెరువులను కౌలుకు చేస్తున్న శివనాగరాజు అనే వ్యక్తి రొయ్యల చెరువునీటిని గుట్టు చప్పుడు కాకుండా రెండు రోజులుగా సాతనూరు వంకలోకి వదలడంతో తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం లేని సమయంలో ఈ కలుషిత నీరు సరాసరి వాటర్ పంపింగ్ వద్ద కలుషితం అవుతోంది. రొయ్యల చెరువుకు సంబంధించిన అసలు యజమానికి తెలియకుండా కౌలుకు చేస్తున్న శివనాగరాజు అనే వ్యక్తి నిర్లక్ష్యంగా కలుషిత నీటిని వదులుతున్నాడు. కనీసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మండల స్థాయి అధికారులు వీటిపైన దృష్టి సారించకపోవడంతో గ్రామాల ప్రజల ఆసుపత్రుల పాలవుతున్నారు. ఈ సంఘటనకు కారణమైన శివనాగరాజు అనే వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## రమణీయం.. ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం


వెండి రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 4(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం వైశాఖ మాస సప్తమి శుభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణభోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. పీఠాధిపతి మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. అనంతరం వెండి రథంను వివిధ పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతి మహా మంగళహారతులు ఇచ్చి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల మంటపంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఊంజలసేవ నిర్వహించారు. పీఠాధిపతి భక్తులకు మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● సీఐ విజయభాస్కర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



గోనెగండ్ల, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైన కఠినచర్యలు తీసుకుంటామని సీఐ విజయభాస్కర్ అన్నారు. మండలంలో ప్రసుత్తం శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయన్నారు.

**ప్రశ్న:** రోడ్డుప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారా?

**జవాబు:** రోడ్డు ప్రమాదాలను అరికంటేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు పనిచేస్తున్నాం. ప్రతిరోజు వాహనాల తనిఖీలు చేపడు తున్నాం. రోడ్డు ప్రమాదాలతోనే అధికంగా ప్రజలు మృత్యువాత పడుతున్నారు.

**ప్రశ్న:** మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై తీసుకుంటున్న చర్యలు?

**జవాబు:** మద్యం తాగి వాహనాలు నడిపేవారి పై కఠిన చర్యలు తీసు కుంటున్నాం. ప్రతి రోజు డ్రంకెన్ డ్రైవ్ చేపడుతున్నాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరంగా శిక్షిస్తాం.

**ప్రశ్న:** సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నారా?

**జవాబు:** ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. ఫేక్ సమాచారం, ఫేక్ లింక్‌లు రావడం తెలి యకుండా వాటిని ఓపెన్ చేస్తే తమ అకౌంట్లో ఉన్న సొమ్ము మొత్తం పోతుంది. గ్రామాల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులను నిర్వహిస్తున్నాం. సైబర్ నేరాలకు గురైన వెంటనే బాధితుడు 1930 నెంబర్‌కు ఫోన్‌చేయాలి.

**ప్రశ్న:** మండలంలో ఫ్యాక్షన్ గ్రామాలు ఎలా ఉన్నాయి ?

**జవాబు:** మండలంలో గతంలో ఫ్యాక్షన్ గ్రామాలుగా కున్నూరు, అగ్రహా రం, బైలుప్పల, గంజహళ్లి, హెచ్‌కైరవాడి, లింగందిన్నె ఉన్నాయి. ప్రస్తుతం మండలంలో కున్నూరును మాత్రమే ఫ్యాక్షన్ గ్రామంగా పోలీసుశాఖ గురించింది.

## మంత్రాలయం చేరుకున్న పాఠ్య, నోటు పుస్తకాలు

మంత్రాలయం, మే 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయానికి వివిధ పాఠశాలలకు అందించే నోటుబుక్స్, పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో రాగన్న తెలిపారు. దాదాపు 90 శాతం నోటుబుక్స్ పాఠశాలకు వచ్చాయని తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను 36వేలు నోటుబుక్స్ మంత్రాలయం చేరుకున్నాయని వాటిని స్థానిక ఉన్నత పాఠశాలలో భద్ర పరిచామని, నేటి నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేస్తామని ఎంఈవో తెలిపారు.

## ఎల్లెల్సీ కాలువలో పూడికతీత పనులు


ఎల్లెల్సీ కాలువలో ఉపాధి కూలీలు పూడిక తీత పనులు చేస్తున్న దృశ్యం

గోనెగండ్ల, మే 4(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలోని తుంగభద్ర దిగువ కాలువలో ఉపాధిహామీ పనుల కింద పూడికతీతను ఐదు రోజులుగా చేస్తున్నారు.. మండల పరిధిలోని గంజహళ్లి గ్రామ కాలువ దగ్గర నుంచి గోనెగండ్ల సెక్షన్ వైపునకు ఈపూడికతీత పనులను ఉపాధి హామీ సిబ్బంది చేపడుతున్నారు. కాలువ గట్ల వెంట ఉన్న చిన్న చిన్న మొక్కలను తొలగిస్తున్నారు. గంజహళ్లి గ్రామ క్రాస్ రోడ్డు నుంచి గోనెగండ్ల, హెచ్ కైరవాడి, వేముగోడు మీదుగా కోడుమూరు వరకు ఎల్లెల్సీ కాలువగట్లు మొత్తం పెద్దమొక్కలు(మొస్తారు పెద్ద చెట్టుమాదిరి) తో నిండిపోయింది. ఈ మొక్కలను పూర్తిగా తొలగించే పనులు కూడా చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అయితే కాలువ గట్ల పగిలిపోయిన చోట సిమెంట్ పనుల కోసం ఎల్లెల్సీ అధికారులు ఎస్టీమేట్ వేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. దానికి సంబధించిన నిధులు విడుదలైన వెంటనే కాలువ గట్లు పగిలిన చోట పనులు చేపడతామని అధికారులు తెలుపుతున్నారు.

## 8న జాబ్‌మేళా

గోనెగండ్ల, మే 4(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 8వ తేదిన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మణిమంజరి తెలిపారు. ఆమె మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హీరో మోటార్ క్రాఫ్ట్, బ్లూస్టార్ గ్రీన్, టెక్ ఇండస్ట్రీస్, పేటీఎం, సన్‌కిసాన్, అగ్రికంపెనీ, శ్రీరామ్‌లైఫ్ ఇన్సూరెన్స్, క్రిడిట్ ఎస్ఎస్ గ్రామీణ లిమిటెడ్, వంటి కంపెనీలతో ఉద్యోగాలు కోసం మండలంలోని పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, చదివిన విద్యార్థులు సర్టిఫికెట్లతో పాటు మూడు ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. 18 నుంచి 40 ఏళ్ల లోపు ఉన్న నిరుద్యోగులు హాజరుకావాలన్నారు.

## 'చర్యలు తీసుకోవాలి'


నందవరం ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నందవరం, మే 4(ఆంధ్రజ్యోతి): కోనేరు నాగేంద్ర ప్రసాద్ కుల మతాలను రెచ్చగొడుతున్నారని, చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు కోరారు. ఆదివారం రాత్రి ఎస్ఐ కేశవకు నాయకులంతా కలసి ఫిర్యాదు చేశా రు. కోనేరు కులమతాలను రెచ్చగొట్టేలా ప్రకటనలు ఇవ్వడం సరికాదని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కాశీంవలి, బీజేపీ నాయకులు గువ్వల నారా యణ, జనసేన నాయకులు యల్లప్ప హితవు పలికారు. ఆంజనేయ విగ్రహన్ని ఎవరైతే పగలగొట్టారో వారిపై ఆరోపించాలిగాని కులమతాలకు చిచ్చపెట్టే విధంగా ప్రకటనలు ఇవ్వడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ప్రకటనలు ఇవ్వడం సబబు కాదన్నారు. విగ్రహం పగలగొట్టిన వెంటనే ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పోలీసులకు ఫోన్‌చేసి విగ్రహన్ని ధ్వంసం చేసిన వారు ఎంతటివారైన ఉపేక్షించ వద్దని పోలీసులకు చెప్పారని గుర్తుచేశారు. అభివృద్ధి పనులకు వ్యతిరేకంగా మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న హిందూ, ముస్లింల ఐక్యతను దెబ్బతీసే విధంగా ప్రవర్తించడం సరికాదన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, వీరేశ్ ఆదిశేషు, దావీదు, మల్లికార్జున, సత్యారెడ్డి పాల్గొన్నారు.

## తాగునీరు వృథా


వృథాగా పారుతున్న తాగునీరు

పెద్దకడుబూరు, మే 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దకడుబూరులోని చావిడి సమీపంలో తాగునీరు వృథాగా పారుతోంది. అసలే వేసవికాలం కావడంతో గ్రామంలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్ నుంచి తాగునీరు వృథాగా పారుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. దీంతో అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు .ఇప్పటికైనా అధికారులు స్పందించి వృథాగా పారుతున్న తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## ఖరీఫ్ సాగుకు రైతన్నలు సన్నద్ధం

14వేల హెక్టార్ లో పత్తి, ఉల్లి, వేరుశనగ, కంది పంటల సాగు


పంట సాగుకు వేరుశనగ విత్తనాలను సిద్ధం చేస్తున్న మహిళా రైతులు

గోనెగండ్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందుగానే వచ్చే విధంగా ఉంది. అడపాదడప కురిసిన వర్షాల కారణంగా ఇప్పటికే మండలంలో ఖరీఫ్ సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. మహిళా రైతులు వేరుశగన విత్తనాలు విత్తేందుకు గాను విత్తనాలను సిద్ధం చేసున్నారు. వారం రోజులుగా కురిసిన వర్షాల కారణంగా రైతులు పొలం పనులు మొదలు పెట్టారు. బావులు, బోర్ల దగ్గర ముందస్తు పనులు పూర్తి చేసుకున్న రైతులు పంట పొలంలో వేరుశనగ, పత్తి, ఉల్లి, పంటలను సాగు చేస్తున్నారు. గోనెగండ్ల మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 14వేల హెక్టార్‌లలో పత్తి, వేరుశనగ, ఉల్లి, కంది, పంటలు సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. గోనెగండ్ల, అలువాల, గాజులదిన్నె, హెచ్ కైరవాడి, కులుమాల, గంజహళ్లి పెద్దనేలటూరు, పెద్దమరివీడు గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఇప్పటికే బావులు, బోర్ల కింద సాగు ప్రారంభించారు.